నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | సోమవారం 16 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు

# పత్తికే మొగ్గు..

## కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దూది సాగుకే ప్రాధాన్యం

- గతేడాది 3.34 లక్షల ఎకరాల్లో.. ఈ యేడాది 3.35 లక్షలకు పైగా..
- ధరల పెరుగుదలతో ఆసక్తిచూపుతున్న రైతులు
- తగ్గుతున్న ఆహారధాన్యాల పంటలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లా రైతాంగం పత్తి పంట వైపు మొగ్గుచూపుతున్నది. గతేడాది వానకాలం సీజన్‌లో 3.34 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, ఈ యేడాది 3.35 లక్షలకు పైగా ఎకరాల్లో సాగు చేస్తున్నది. జిల్లా మొత్తంగా 4.45 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేస్తుండగా, ఇందులో అత్యధికంగా దూదికి ప్రాధాన్యమివ్వడం కనిపించింది. యేటేటా పెరుగుతున్న ధరలకనుగుణంగా పత్తిపై అన్నదాతలు ఆసక్తి చూపుతుండగా, మిగతా పంటల సాగు క్రమంగా తగ్గుతున్నది.

### 3.35 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో గతేడాది ఏడాది వానాకాలం సీజన్‌లో 3.34 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ప్రస్తుతం వానకాలంలో 3,35,363 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే సుమారు 1363 ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. గతంలో ఆహార పంటలపైపు అధికంగా మొగ్గుచూపిన రైతులు.. కొన్నేళ్లుగా పత్తి సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. పత్తి ధరలు యేటేటా పెరుగుతుండడంవల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అర్థమవుతున్నది. ఇదేకాకుండా వరి, ఇతర ఆహార పంటలకు గిట్టుబాటు ధర ఉంటుందో లేదోనన్న అనుమానాలు రైతులను పత్తి సాగువైపు మళ్లిస్తున్నాయి. జిల్లా మొత్తంగా 4లక్షల 45 వేల 49 ఎకరాల్లో పంటలు సాగవుతుంటే ఇందులో అత్యధికంగా పత్తి సాగవుతోంది. ఇక కొంత మంది రైతులు మాత్రమే కూరగాయల సాగువైపు మొగ్గుచూపున్నారు.

### తగ్గిన ఆహార ధాన్యాల సాగు

జిల్లా రైతాంగం వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపుతున్నది. ఇందులో పత్తికే అత్యధికంగా ప్రాధాన్యమిస్తున్నది. వాణిజ్య పంటల సాగుతో అధికంగా లాభాలు వస్తాయని భావించి ఆహార ధాన్యాలు సాగు చేయడం తగ్గిస్తున్నారు. గతంలో జిల్లాలో వరి, గోధుమ, మొక్కజొన్న, జొన్న, పెసర, మినుములు, శనగ, చిక్కుడు, కందిని అత్యధికంగా సాగు చేసేవారు. నువ్వులు, పొద్దుతిరగుడువంటి పంటలతో పాటు కూరగాయలు కూడా అధికంగా సాగయ్యేవి. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పంటల మార్పిడి చేస్తున్నారు.

### అవగాహన కల్పిస్తున్నా..

సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి.. వ్యవసాయ పెట్టుబడులను తగ్గించుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా రైతులు రసాయన ఎరువులతో పత్తి పంటను సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. పైగా పత్తిపై చీడపీడలను నివారించేందుకు రసాయన ఎరువులను విపరీతంగా వాడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటుంది. ఇక పత్తి అధికంగా సాగు చేయడం వల్ల పశువులకు కూడా ఆహార కొరత ఏర్పడుతోంది. ఇంటికి అవసరమైన ఆహార పంటల సాగు పోగా.. మిగిలిన భూమిలో రైతులు పత్తి సాగుకే ప్రాధాన్యతను ఇస్తున్నారు. వ్యయసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో రైతులకు ఆహార పంటల సాగు పెంచాలని ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా చర్యలు చేపడుతున్నారు. రైతుల్లో ఆశించినంతగా మార్పు కనిపించడం లేదు. పైగా పత్తి పంటను సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం ఆహార పంటలను కొనుగోలు చేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఆహార పంటల్లో వరి తప్ప.. మిగతా ఏ పంటలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు పత్తి పంటసాగుపై ఆసక్తి చూపుతున్నట్లు అర్థమవుతుంది.





ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని దిందా అడవుల్లో నరికి వేసిన టేకు చెట్లు

అటవీశాఖలో ఇంటి దొంగలు



# పోడు వెనుక అధికారులే సూత్రధారులు!

## అడవుల నరికివేతకు గిరిజనేతరులకు సహకరిస్తున్న సిబ్బంది

- ఫారెస్ట్ ఉన్నతాధికారుల విచారణలో విస్తుపోయే నిజాలు
- ఖర్జెల్లి ఎఫ్ఎస్‌వో సస్పెన్షన్‌కు కారణాలు ఇవే..
- మరి కొందరిపైనా వేటుపడే అవకాశం



ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని బండెపల్లి అడవుల్లో నరికి వేసిన చెట్టు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : అడవులను రక్షించాల్సిన అటవీశాఖ అధికారులే గిరిజనేతరులకు సహకరిస్తూ.. పోడు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తున్నది. చింతలమానేపల్లి మండలం దిందా, బండెపల్లి, ఖర్జెల్లి అటవీ ప్రాంతాల్లో వేలాది ఎకరాల అడవులను నరికి పోడు సాగు చేస్తున్నారన్న ఘటనలపై ఇటీవల ఉన్నతాధికారుల బృందం విచారణ చేపట్టగా, విస్తుపోయే నిజాలు వెలుగు చూడడం ఆందోళనకు గురిచేస్తున్నది.స్వయంగా ఖర్జెల్లి అటవీ సెక్షన్ అధికారి అజ్మీర మోహన్ పోడు సాగుకు సహకరించినట్లు గుర్తించి.. ఆ వెంటనే సస్పెండ్ చేయగా, అనేక ఆరోపణలకు బలం చేకూరినట్లయ్యింది.

### టైగర్ కన్జర్వేషన్‌గా మారడంతో..

జిల్లా సరిహద్దులోని ప్రాణహిత నదిని ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. చింతలమానేపల్లి, కౌటాల, బెజ్జూరు, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలకు సరిహద్దున ప్రాణహిత నది ప్రవహిస్తుండంతో ఆ ప్రాంతంలో సహజమైన, దట్టమైన అడవులు ఉన్నాయి. ఈ అడవుల కారణంగానే ఆసిఫాబాద్‌కు అడవుల ప్రాంతంగా గుర్తింపు వచ్చింది. ప్రాణహిత నదికి అవతల మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతం ఉంది. ఇది పులుల అభయారణ్యం. ప్రాణహితకు అవతల తడోబా పులుల సంరక్షణ కేంద్రం ఉండడం.. ప్రాణహితకు ఇవతల దట్టమైన అడవులు ఉండడంతో పులులు అక్కడి నుంచి ప్రాణహితను దాటుకొని కాగజ్‌నగర్ డివిజన్‌లోని అటవీ ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని పులులు ఇక్కడి అడవుల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. దాదాపు పదేళ్లుగా పులుల రాకపోకలు పెరుగడంతో ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం ఇటీవల టైగర్ కన్జర్వేషన్‌గా ప్రకటించింది. ఈ క్రమంలో కాగజ్‌నగర్ అడవి డివిజన్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించిన అధికారులు ఇక్కడి అడవులను ఆక్రమణల నుంచి కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎకరాల కొద్ది అటవీ భూములను ఆక్రమించిన వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో వందలాది ఎకరాల్లోని అటవీ భూములను ఎవరి సహకారంతో నరికారనే దానిపై విచారణ చేపడుతుండగా.. విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి.

### అటవీ భూములన్నీ గిరిజనేతరుల చేతుల్లోనే...

జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్‌లో అటవీ భూములు అధికంగా గిరిజనేతరుల చేతుల్లో ఉన్నాయి. సిర్పూర్ –టీ మండలం చీలపల్లి, ఆరెగూడ, భూపాలపట్నం, లక్ష్మీపూర్, హీరాపూర్, ఇటుకలపహాడ్, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల పరిధిలో గిరిజనేతరుల చేతిలో వేలాది ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. చింతలమానేపల్లి మండలం పరిధిలోని దిందా, బండెపల్లి, కోర్సిని, అడెపల్లి, గూడెం, శివపల్లి, కోయపల్లి, గంగాపూర్ గ్రామాల పరిధిలో, బెజ్జూర్ మండల పరిధిలోని కుకుడ, పాపన్‌పేట్, పెంచికల్‌పేట్ మండల పరిధిలోని కొండపల్లి, లోడ్‌పల్లి, జైహింద్‌పూర్, అగర్‌గూడ, దరోగపల్లి, బొంబాయిగూడ, రస్‌పల్లి, బాబాసాగర్, దహెగాం మండలం హత్తిని, ఐనం, రాంపూర్ తదితర ప్రాంతాల్లో ఒక్కో కుటుంబం పది ఎకరాలకు పైగానే ఆక్రమించుకున్నట్లు తెలుస్తుంది. అటవీ అధికారులు సహకారం వల్లే అడవుల ఆక్రమణకు హద్దులు లేకుండా పోతున్నట్లు ఆరోపణలున్నాయి.

### గతంలోనూ అనేక మంది అధికారులపై వేటు..

గతంలో అడవుల నరికివేతకు.. కలప అక్రమ రవాణాకు సహకరించిన అనేక మంది అటవీ అధికారులపై వేటు పడింది. కెరమెరి మండలం జోడేఘాట్, లింగాపూర్, వాంకిడి, కెరమెరి మండలాల్లో జరిగిన పలు ఘటనల్లో అధికారులపై అంతర్గతంగా జరిపిన విచారణల్లో అనేక నిజాలు వెలుగుచూశాయి. అక్రమాలకు పాల్పడిన అనేక మంది అధికారులను సస్పెండ్ చేశారు. లింగాపూర్, జోడేఘాట్ అటవీ ప్రాంతాల్లో నేరుగా అటవీ అధికారులే స్మగ్లర్లతో చేతులు కలిపి కలపను అక్రమ రవాణా చేస్తున్న ఘటనలు కూడా వెలుగుచూశాయి. తాజాగా.. అడవుల నరికివేతకు సహకరించిన ఖర్జెల్లి ఎఫ్ ఎస్‌వోను జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రివాల్ సస్పెండ్ చేశారు. ఈ విషయంలో మరికొంతమంది అధికారులపైనా వేటు పడే అవకాశమున్నది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో గిరిజనేతరులు వేలాది ఎకరాల అటవీ భూములను ఆక్రమించి పోడు వ్యవసాయం చేస్తున్నారు. గిరిజనుల పేరుతో గిరిజనేతరులు అడవులను అక్రమిస్తున్నారు. గిరిజనేతరులకు అటవీ అధికారులే సహకరిస్తుండడంతో వేలాది ఎకరాల అడవులు అంతరిస్తున్నాయి.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

# బాధితులకు అండగా ఉంటా


## ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 15 : పిడుగుపడి గాయపడ్డ బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఇటీవల గాదిగూడ మండలం పిప్పిరిలో పిడుగు పాటుతో గాయపడి ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం ఆమె పరామర్శించారు. బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనులు చేసుకుంటున్న నేపథ్యంలో ఇలాంటి ఘోరం జరగడం చాలా బాధాకరమని, వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నట్లు తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు సూచించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్టీపర్పస్ వర్కర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

- కొండాపూర్ గ్రామస్తుల డిమాండ్
- దండేపల్లి సబ్‌స్టేషన్ ముందు రాస్తారోకో
- న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ

దండేపల్లి, జూన్ 15 : కొండాపూర్ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ ప్రభాకర్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన భారతారపు లింగయ్య, కుమారస్వామిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం దండేపల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. భూ విషయమై గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు లింగయ్య, కుమారస్వామి ఓ మహిళతో గొడవపడ్డారు. సదరు మహిళా జీపీ మల్టీపర్పస్ వర్కర్ ప్రభాకర్‌ను అక్కడికి పిలిచింది. ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకోగానే వికలాంగుడు అని చూడకుండా తండ్రీకొడుకులు విచక్షణారహితంగా కొట్టడంతో చేయి విరిగింది. తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. ఇదే విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్‌ఐ రిమాండ్ చేయడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఎస్‌ఐ తహసినొద్దీన్ ఆందోళన వద్దకు చేరుకొని మాట్లాడే ప్రయత్నం చేయగా, గ్రామస్తులు–ఎస్‌ఐకి మధ్య వాగ్వాదం జరిగింది. దాడి చేసిన వారిని ఎందుకు రిమాండ్ చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంట పాటు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విచారణ జరిపి నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. గ్రామ పెద్దలు పోలీస్‌స్టేషన్‌లోకి రాగా.. అప్పటికే అక్కడికి చేరుకున్న లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి వారితో మాట్లాడారు. మెడికల్ రిపోర్టు రాగానే వారిని రిమాండ్ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



రాస్తారోకో చేస్తున్న కొండాపూర్ గ్రామస్తులు

# మాపై మీ పెత్తనమేమిటి?

## హోల్ సేల్ వ్యాపారులపై చిరు వ్యాపారుల ఫైర్.. ఆందోళన

లక్షెట్టిపేట, జూన్ 15 : 'మాపై మీ పెత్తనమేమిటి' అంటూ లక్షెట్టిపేట పట్టణంలోని కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులపై చిరు వ్యాపారులు ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగారు. కూరగాయల చిరు వ్యాపారులు మాట్లాడుతూ... హోల్‌సేల్ వ్యాపారులు తమపై పెత్తనం చెలాయిన్నారని, ప్రతి ఆదివారం, గురువారం మార్కెట్‌లో తమకు కూరగాయల అమ్మి.. అక్కడే ప్రజలకు కూడా హోల్‌సేల్ ధరలో అమ్ముతూ తమ పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో ఒక్కటే అంగడి కొనసాగించాలని వారు కోరారు. విషయం తెలుసుకున్న లక్షెట్టిపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చిరు వ్యాపారులను సముదాయించారు. హోల్‌సేల్ వ్యాపారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న కూరగాయల వ్యాపారులు



తహసీల్దార్ ఆఫీసులో విరిగిన స్టీల్ కుర్చీకి సపోర్టుగా పెట్టిన ఫైళ్లు, ఇటుక

# విరిగిన కుర్చీకి ఫైళ్లే సపోర్టు

నెన్నెల తహసీల్దార్ కార్యాలయంలోని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకు వచ్చే వారి కోసం స్టీల్ కుర్చీ ఏర్పాటు చేయగా, దానికి ఓ వైపు కాలు విరిగింది. దానికి సపోర్టుగా కార్యాలయ ఫైళ్లు, సిమెంట్ ఇటుక పెట్టారు. వివిధ పనుల కోసం వచ్చిపోయే వారంతా ఆ కుర్చీపై కూర్చునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా దానికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– నెన్నెల, జూన్ 14

# సింగరేణి వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి

- లాభాల్లో నుంచి కార్మికులకు 35శాతం వాటా చెల్లించాలి
- సంస్థలో రాజకీయ జోక్యం తగ్గించాలి
- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి
- శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా బండి రమేశ్ ఏకగ్రీవం

సీసీసీ నస్పూర్, జూన్ 15: సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని, కార్మికులకు లాభాల్లో నుంచి 35 శాతం వాటా చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్‌లోని మంచిర్యాల బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన శ్రీరాంపూర్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు. మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో పెట్రేగిపోయిన రాజకీయ జోక్యాన్ని తగ్గించాలన్నారు. మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని, సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని సంస్థలోని అన్ని సింగరేణి హాస్పిటళ్లలో మందులు అందుబాటులో ఉంచాలని, కార్మికులకు రెఫరల్ సౌకర్యాన్ని సులభతరం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభాలను యాజమాన్యం వెంటనే ప్రకటించాలన్నారు. ఈ మధ్యలో వచ్చిన బదిలీల సర్క్యులర్ ఉద్యోగులకు ఆమోదయోగ్యంగా లేదని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



బండి రమేశ్‌ను అభినందిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

### శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా బండి రమేశ్

శ్రీరాంపూర్ ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా బండి రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియా నుండి వచ్చిన ముఖ్య కార్యకర్తలు, అన్ని గనుల పిట్, అసిస్టెంట్ సెక్రటరీలు పాల్గొని బండి రమేశ్‌కు మద్దతు నిలిచారు. అనంతరం ఇది వరకు శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా సేవలు అందించిన పెట్టం లక్ష్మణ్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కొత్తగా ఎన్నికైనా బండి రమేవ్‌కు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి గోగుల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంక్యుబేటర్లపై పట్టింపేది?

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో చిన్న పిల్లలకు వినియోగించే ఇంక్యుబేటర్లు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ పరికరాలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తెస్తారో లేదో చూడాలి మరి..

– మంచిర్యాల స్టాఫ్ ఫొటో గ్రాఫర్

ప్రభుత్వ దవాఖానలో మూలన పడేసిన ఇంక్యుబేటర్లు

